జిల్లా పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని వివిధ ప్రతిభావంతులకు పలు రకాల సేవలు అందుబాటు లోకి తెచ్చి అండజేసేందుకు గాను భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సౌజన్యంతో జిల్లా పునరావాస కేంద్రాన్ని స్థాపించుటకు గాను జిల్లా పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, డిఓఆర్ చైర్మన్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరంకు సదరు పునరావాస కేంద్ర స్థాపనకు, నోడల్ ఏజెన్సీని ఎంపిక చేయుటకు దివ్యాంగుల కోసం పని చేస్తున్న ఆసక్తి గల స్వచ్ఛంద సంస్థలు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ / ప్రభుత్వేతర స్వయం ప్రతిపత్తి సంస్థ ద్వారా ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తును ఈనెల 17వ తేదీ లోపు సహాయ సంచాలకులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పెద వాల్తేరుకు పంపాలన్నారు. జిల్లా పునరావాస కేంద్ర స్థాపనకు సంబంధించిన నియమ నిబంధనలకు సంప్రదించాలని సూచించారు. ఇతర వివరములకు సహాయ సంచాలకులు, వివిధ ప్రతిభావంతులు, హిజ్రాలు: వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రాణి చంద్రమణి దేవి ఆసుపత్రి ప్రాంగణం, పెద వాల్తేరు, విశాఖపట్నంలో నేరుగా గాని లేదా కార్యాలయ ఫోన్ నెంబర్ 09912952585ని సంప్రదించాలని తెలిపారు.

ఆదివాసి సాంస్కృతిక సంబరాల్లో...

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

▸▸ అలరించిన రాజమండ్రి మ్యాజిక్ షో ▸▸ వాయిద్య శబ్దాలతో హోరెత్తిన అరకులోయ

ప్రజాశక్తి -అరకులోయ /అరకు రూరల్:ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఎనిమిదవ మహాసభల సందర్భంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో 6,7,8 తేదీల్లో ఆట పాట మాట అనే నినాదంతో జరుగుతున్న ఆదివాసి సంస్కృతిక సంబరాలు గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి బింబించాయి. రెండో రోజైన కార్యక్రమాన్ని గిరిజన సంఘం జాతీయ కార్య వర్గ సభ్యుడు బి.అప్పలనర్స, రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, సంస్కృతిక సంబరాల నిర్వహణ కమిటీ చైర్మన్ చిట్టిబాబు, రఘునాథ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు మంగరాజు, కన్వీనర్ జోషి ప్రారంభించారు. మునుపెన్నడూ లేని విధంగా మరుగున పడిపోయిన గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావి ప్రపంచానికి తీసుకుని వచ్చి స్వతంత్ర సమర యోధుడు ఆదివాసి పోరాట యోధుడు కామయ్య కళావేదిక వద్ద ప్రదర్శించిన వివిధ కళా ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంది. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వేసిన ప్రదర్శనలు గిరిజన సంస్కృతికి దర్పణం పట్టాయి. మొదటి రోజు ఈ వేదికలో సుమారు 10 రకాల కళారూపాలు అంతరించి పోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా నిలిచి జీవం పోసాయి. రెండవ రోజు అందుకు భిన్నంగా వేసిన కళా ప్రదర్శనలు సంస్కృతిక ప్రదర్శనలతో పాటు రాజమండ్రి శ్రీరాములు ప్రదర్శించిన మెజీషియను అమితంగా ఆకట్టుకుంది. దుమ్ముగూడ, చొంపి గ్రామానికి చెందిన గిరిజన సంస్కృతిక దింసా నృత్య ప్రదర్శనలు అమితంగా ఆకట్టుకున్నాయి. దుంబ్రిగూడ మండల జామరవలస సంకిటి నృత్యం ముచ్చింగిపుట్టు బ్రాండ్ బాజా, మాడగడ వాయిద్యం, చొంపిబుట్టు దింసా, కిరాయిగూడ అలెక్ భజన, మర్రిగూడ తాల నాటకం, జాతర వలస బుడియా నాటకం విశేషంగా ఆకట్టుకున్నాయి. గిరిజన సాంస్కృతిక సంబరాల్లో పాల్గొన్న ప్రతి కళా బృందానికి ఆదివాసి సంస్కృతిక సంబరాల నిర్వహణ కమిటీ నాయకులు గిరిజన సంఘం నాయకులు వివిధ పాఠశాలల గిరిజన ప్రధానోపాధ్యాయులు మెమెంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ సంస్కృతిక ప్రదర్శనలకు సంబంధించి అధ్యక్షత వహించారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనరస, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, మండెన సీతారాం, పోతురాజు, కొండలరావు, వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు చిట్టిబాబు, కె.రఘునాథ్, దేముడు, గిరిజనులు వేసిన సంస్కృతిక నృత్య ప్రదర్శనలను తిలకించారు. సంబరాల్లో పాల్గొన్న వివిధ కళాబృందానికి ప్రధానోపాధ్యాయులు దయానిధి, నారాయణ, మహేష్ నందు, అప్పలనరస, ముకి సాంబయ్య, కృష్ణకుమారి, విజయ్ కుమార్, రాంబాబు, రెవెన్యూ శాఖ ఎలక్షన్ డ్యూటీ అప్పన్న, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, తదితరులు మెమెంటో సర్టిఫికెట్లు అందజేశారు.

మ్యాజిక్ చేస్తున్న కళాకారుడు

డప్పులు వాయిస్తున్న కళాకారులు

నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

నివాళ అర్పిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

వరదలు రాకముందే
విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టాలి
- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదల సమయంలో ఇబ్బంది లేకుండా ముందుస్తుగా విద్యుత్ సమస్యలపై ఆ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ కారం లక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో నెలల తరబడి ఏజెన్సీ గ్రామాలు నీట మునిగి, విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో ఉండవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరదలు వస్తే మళ్లీ అటువంటి ఇబ్బందులే పడాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని చింతూరు నుంచి కుందులూరు మీదుగా పెద్దమట్టపల్లి, రేకపల్లి వరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. చింతూరు నుండి కుందులూరు మీదుగా గతంలో ఒక లైన్ ఉండేదని, దాని ద్వారా కుందులూరు నుండి వరద ముంపునకు గురైన ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ రేఖపల్లి మండల కేంద్రం వరకు కరెంటు ఇచ్చేవారని, దాని వల్ల వరదలు వచ్చినా విద్యుత్ సప్లై ఉండేదని పేర్కొన్నారు. వరదల కాలంలో విద్యుత్ సరఫరాకు వీలుగా ఈ లైన్‌ను పునరుద్ధరించాలని కోరారు. చిన్న గాలి దుమారం వచ్చినా కరెంటు అంతరాయం తరచుగా కలుగుతుందని, ఈ లోపాలను సరిచేయాలన్నారు. వరదలు ఎదుర్కోవటానికి విద్యుత్ శాఖ పూర్తిగా సన్నద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎపి గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి, సర్పంచ్ పులి సంతోష్ కుమార్, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, సోడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను ఇబ్బంది పెడితే చర్యలు

రెవెన్యూ సిబ్బందికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక

ప్రజాశక్తి-పాడేరు : జనన ధృవీకరణ పత్రాల జారీకి నోటరీ చేయాలని గిరిజనులను ఇబ్బందులు పెడితే రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్: హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయపు వీడియో సమావేశ మందిరం నుండి పాడేరు, రంప చోడవరం డివిజన్ల పరిధిలోని సర్వే అధికారులు, తహాశీల్దారులు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో చేపట్టిన భూముల రీ సర్వే, పివిటిజి ఓటర్ల నమోదు, ఫారం 7, ఫారం 6 సేకరణ, ఎస్సైన్మెంటు భూముల గుర్తింపు, కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవ పత్రాల జారీ, ఫిర్యాదుల పరిష్కారాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వారం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. విఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు డేటా ఎంట్రీ పూర్తి చేసి గ్రామ సభలు నిర్వహించి రైతుల నుండి అభ్యంతరాలను స్వీకరించాలని స్పష్టం చేసారు. తహాశీల్దారులు విఆర్ఓలతో సమావేశాలు నిర్వహించి నిర్దేశించిన గడువులోపు డేటా ఎంట్రీ పూర్తి చేయించా లన్నారు. ఎస్సైన్మెంట్ భూముల సేకరణ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు.

విఆర్ఓల గైర్హాజరు పై ఆగ్రహం

గ్రామ సచివాలయాల సందర్శించినపుడు విఆర్ఓలు సక్రమంగా హాజరు కావడం లేదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రతీ రోజు విఆర్ ఓలు సచివాలయాలకు రాకపోతే డ్యూటీ సర్టిఫికేట్లు జారీ చేయకూడదని తహాశీల్దారులకు సూచించారు. కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ లబ్దిదారులు తిరగ కూడదన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, రంపచోడవం పి.ఓ సూరజ్ గనోరే, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ పి. అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై.మోహన రావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే నాగేశ్వరరావు, తహాశీల్దారులు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వడదెబ్బకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం మర్రిపాలెం గ్రామం సమీపంలో బుధవారం వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కొయ్యూరు పోలీసులు తెలిపారు. మృతుని పేరు రాజు అని, నర్సీపట్నం, చుట్టు పక్కల గ్రామాలలో చెత్త, స్క్రాప్‌ను ఏరుకుంటూ ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. ఆయన అనపర్తి చుట్టు పక్కల ప్రాంతానికి చెందిన వాడై ఉంటాడని మరి కొంతమంది అంటున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు కొయ్యూరు పోలీసు స్టేషన్‌లోగాని, 9440904218 (కొయ్యూరు సిఐ), 9440904241 (కొయ్యూరు ఎస్ఐ), 9440904217 (మంప ఎస్ఐ) నెంబర్లకు గాని సంప్రదించాలని పోలీసులు కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాస్

గురుకులాల్లో వసతులు మెరుగుపరచండి
ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీలోని గిరిజన గురుకులాల్లో అడ్మిషన్ల కంటే ముందు వసతి సౌకర్యాలను మెరుగు పరచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే.ప్రభుదాస్ అధికారులను కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ, ఈ నెల 9,10తేదీల్లో గురుకులాల్లో సీట్లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కౌన్సిలింగ్ ఉంటుందని పిఒ ప్రకటించారని, అడ్మిషన్ల కంటే ముందు వసతి సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థి సంఘంగా ప్రాజెక్ట్ అధికారికి విన్నవించు కుంటున్నామని చెప్పారు. పాఠశాలలు తెరవక, అడ్మిషన్లు పూర్తికాకముందే గురుకులాల్లో పివో పర్యవేక్షణ చేయాలని కోరారు. ఏజెన్సీ 11 మండలాల్లో 8 గురుకుల కళాశాలలు ఉన్నాయని, ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో కనీస వసతులు లేవని వాపోయారు. అదే విధంగా గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి నచ్చిన గ్రూపులో సీట్లు కేటాయించాలని, వీలైనంత ఎక్కువగా సీట్లు కల్పించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ప్రవేశాలు కల్పించాలన్నారు. ఇందుకు అనుగుణంగా వసతి సౌకర్యాలను విస్తరించాలన్నారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల కొరత కూడా ఉందని, విద్యా బోధన కుంటుపడుతోందని దీనిపై అధికారులు దృష్టి సారించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థుల ఉత్తీర్ణత పెంచే విధంగా మెరుగైన విద్యా బోధన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది ఆన్లైన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించడంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని, ఒక గ్రూపులో సీటు కోసం దరఖాస్తు చేసుకుంటే వేరే గ్రూపులో సీటు వచ్చిన పరిస్థితి చూశామన్నారు.. అంతేకాకుండా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లు రాక ఐటీడీఏ, కళాశాలల చుట్టూ ప్రదక్షిణలు తిరిగిన పరిస్థితులు చూశామన్నారు. ఈ ఏడాది ఇలా చేస్తే విద్యార్థులంతా ఏకమై కచ్చితంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు మత్యరాజు, లోకష్, నరేష్, మాణిక్యం మణి పాల్గొన్నారు.

నేడు పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి -అనంతగిరి:మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంక్‌ను ఈనెల 8న గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ఉమ్మడి జిల్లా చైర్ పర్సన్ ల చేతుల మీదుగా ప్రారంభి స్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మండల కేంద్రంలో హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంక్ ప్రరంభానికి సిద్ధం చేశారు. సంబదిత కాంట్రాక్టర్, అదికారుల సమన్వయంతో పనులు వేగవంతంగా చేశారు.పెట్రోల్, డీజిల్, క్రుడాల్ ఆయిల్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధం చేశారు.

పెట్రోల్ బంక్

ఆదివాసీ పోరాట యోధులను ఆదర్శంగా తీసుకోవాలి

- గాం గంటం దొర విగ్రహావిష్కరణ
- శత వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

ప్రజాశక్తి- కొయ్యూరు

స్వాతంత్ర్యోద్యమంలో ఆదివాసీ యోధులు చేసిన పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. కొయ్యూరు మండలం బట్ట పనుకుల పంచాయతీ పరిధి లంకవీధి గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు గాం గంటం దొర శత వర్ధంతి వేడుకలు పాడేరు ఐటిడిఎ, క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గంటం దొర కాంస్య విగ్రహాన్ని ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గంటం దొర కుటుంబ సభ్యులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. వచ్చే ఏడాది ఇదే సమయానికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు జరగాలని ఈ సభలోనే నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన గాం గంటం దొర కుటుంబ సభ్యులు నిలువు నీడ లేకుండా ఉన్న పరిస్థితుల్లో వారందరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేసి గృహ నిర్మాణానికి పూనుకున్న ఎన్‌సిసి వారికి ధన్యవాదాలు తెలిపారు. గాం గంటం దొర, గాం మల్లుదొర, బోనంగి పండు పడాల్, తగ్గి వీరయ్య దొర వంటి స్థానిక నాయకులకు అల్లూరి సీతారామరాజు శిక్షణ ఇచ్చి బ్రిటిష్ వారు నుంచి విముక్తి కోసం పోరాడేలా తీర్చిదిద్దారని తెలిపారు. అటువంటి పోరాటం నడిచిన ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. గంటం దొర కుటుంబ సభ్యులకు ఇళ్ల నిర్మాణంలో సహాయ సహకారాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంటం దొర కుటుంబ సభ్యుల్లో నిరుద్యోగులకు ఉపాధి మార్గాలు చూపించే ఆలోచన కూడా చేస్తున్నామని, ఈ విషయంపై ఐటిడిఏ పీవో అభిషేక్‌తో చర్చించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పీఏసీఎస్ చైర్మన్ సూరిబాబు, క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు నాని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు శోభా సోమేశ్వరి, షేక్ మీరా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, బుజ్జి, సీనియర్ నాయకులు గాడి సత్తిబాబు, మహేష్, అప్పారావు, కొమ్ముక శేఖర్, ముసలినాయుడు, ఎంపీటీసీ గాంధీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గంటం దొర విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ, పిఒ

పోలవరం నిర్వాసితుల

సమస్యల పరిష్కారం కోసమే మహాపాదయాత్ర

వైస్ ఎంపిపి పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య

ప్రజాశక్తి- కూనవరం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసమే ఈ నెల 20 నుండి మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య తెలిపారు. మండలంలోని పల్లూరు గ్రామంలో పాదయాత్రపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వల్ల నష్టపోతున్న నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం చూపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది వచ్చిన వరదల వల్ల ముంపు మండలాల ప్రజలు ఆర్థికంగా నష్ట పోయారని తెలిపారు. వరదల సమయంలో విద్యుత్ సరఫరా లేక కటిక చీకటిలో వారాల తరబడి ఇబ్బంది పడ్డారని వాపోయారు. వరదల సమయంలో కనీసం నిత్యావసరాలు కూడా అందించలేదన్నారు. ఆ సమయంలో వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ముంపు మండలాల నుండి విజయవాడ వరకు జరుగుతున్న పాదయాత్రకు ప్రతి నిర్వాసితుడు తరలిరావాలని పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్ట్ కింద మునుగుతున్న గ్రామాలన్నింటినీ ఒక యూనిట్‌గా చేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని, వచ్చే వరదలకు ప్రభుత్వం నిత్యావసరాలు అందించాలని, బఫర్ స్టాక్ పాయింట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల నాయకులు ఆవుల మురళి, ఆవుల ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు, జోడే రాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

అరకు బయలుదేరిన కళాకారులు

ఆదివాసీ సాంస్కృతిక సంబరాలకు తరలివెళ్లిన కళాకారులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర 8వ మహాసభ సందర్భంగా ఈ నెల 6, 7, 8 తేదీల్లో అరుకులో ఆట, పాట, మాట నినాదంతో నిర్వహిస్తున్న ఆదివాసి సాంస్కృతిక సంబరాలకు మండలంలోని లోదొడ్డి పంచాయతీకి చెందిన గిరిజన కళాకారుల బృందం బుధవారం తరలివెళ్లింది. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆధ్వర్యంలో గిరిజన నృత్య కళాకారులు 20 మంది బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కళాకారుల బృంద నాయకులు రమేష్, రాజు, వెంకటలక్ష్మి మాట్లాడుతూ, అంతరించిపోతున్న గిరిజన సాంస్కృతిక సంప్రదాయాలకు పునర్జీవాన్ని ఇచ్చేలా గిరిజన సంఘం ఆధ్వర్యంలో కళారూపాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు వంతు బాలకృష్ణ, మిరియాల తవడయ్య, గిరిజన సంఘం నాయకులు పాండవుల సత్యనారాయణ, జర్తా రాజు, రమణ, డివైఎఫ్ఐ నాయకులు శ్రీను, సిఐటియు నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రజల వద్దకే నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించే ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. రాజవొమ్మంగి పంచాయితీలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ప్రజాధరణ పొందుతుందన్నారు. రాష్ట్ర అభివద్ధి చూడలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, వైసిపి మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, మండల సర్పంచ్ సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సీఐ బాజీలాల్, డిప్యూటీ తహాశీల్దారు ఎ.సత్యనారాయణ, ఎంపీడీఓ కె.బాపన్న దొర, ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాల కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఆడుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్నారులకు స్పూన్ ఆటలు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 22 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత, సిబ్బంది కే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ముఠా కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం బుధవారం ఆ సంఘం ప్రెసిడెంట్ రుత్తల గోవింద్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిఐటియు నేత డి.సత్తిబాబు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కొటేశ్వరరావు మాట్లాడుతూ, దేశంలో ముఠా కార్మికులకు సమగ్ర చట్టం లేదని, శక్తి ఉన్నంత కాలం పని చేసి, వయసు మళ్ళితే దిక్కులేని బతుకులు బతకాల్సి వస్తుందన్నారు. కూలి డబ్బులు పిల్లలు చదువులు, వైద్యానికే సరి పోని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందారు. ఏళ్ళ తరబడి నర్సీపట్నంలో ఉన్న అనేక మంది కార్మికులకు శాశ్వత ఇళ్ళు లేవున్నారు. అనంతరం నర్సీపట్నం ముఠా కార్మిక సంఘం సెక్రటరీగా అడిగర్ల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ, ముఠా కార్మికుల సమస్యలు పరిష్కారంకు నిరంతరం పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమలో ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, కోశాదికారి ఎం. రమణ, నాయుడు, నాగేశ్వరరావు, సాంబ, రాము, నానాజీ పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని కాగిత గ్రామంలో గొల్లవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. కూలీల మస్తరులను తనిఖీ చేశారు. పారదర్శకంగా పనులు చేపట్టాలన్నారు. నిర్దేశించిన సమయానికి కూలీల ంతా పనికి హాజరై కనీస వేతనం వచ్చే విధంగా పని చేయాలన్నారు. పని ప్రదేశంలో వాటర్ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు .

ఊరేగింపునకు అడ్డంకి

ప్రజాశక్తి-మాడుగుల: మోదకొండమ్మ అమ్మవారి పండగ వైభవంగా జరిగినప్పటికీ అర్ధరాత్రి వూరేగింపు విషయం లో వివాదం చెల రేగింది. సుమారు మూడు నెలల కిందట గ్రామానికి చెందిన శ్రీనాథు రామ మూర్తి, రమేష్ కుటుంబంలో జరిగిన వివాహ కార్యక్రమానికి ఇంటి ముందు భారీ పందిరి వేశారు. ఇప్పటి వరకు సదరు పందిరి తొలగించలేదు. అమ్మవారి పండగ వూరేగింపులో పలు బండ్ల వేషాలు ఏర్పాటు చేశారు. సెట్టింగులతో కొంచెం ఎత్తులో వుండగా, సదరు వూరేగింపు పెళ్లి పందిరి వేసిన ఇంటి ముందుకు వచ్చేసరికి పందిరి అడ్డు తగలడంతో వూరేగింపు ఆగిపోయింది. దీంతో బండ్ల వేషాల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పందిరి తొలగించమని కమిటీ వారు చెప్పినా, సదరు నిర్వాహకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో తీవ్ర వాగ్వాదానికి జరిగిన తరువాత బండ్ల వేషాలు ఆ ఇంటి ముందు ఉదయం వరకు ఆగి పోయాయి. అమ్మవారి ఘటాలు ఎలాగోలా గుడికి చేరుకున్నాయి. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో మిలీనియం ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ బి.బాబు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అల్లూరి జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ బి.బాబు సూచించారు. బుధవారం అరకులోయ మండలంలోని పద్మాపురం పంచాయతీలో పద్మాపురం, ప్రధాని పుట్, యండపల్లివలస తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అరకు డివిజన్లో 4,184 ఇళ్లలు మంజూరు కాగా. 3,755 ఇళ్లలు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మిగిలిన మరో 429 ఇళ్లలు ఇంకా ప్రారంభించవలసి ఉందన్నారు. గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసిన లబ్ధిదారులు వెంటనే తమ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సిహెచ్ క్రిష్ణారావు, వర్క్ ఇన్స్పెక్టర్ ఎస్ కాంతి, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ పీడీ బి.బాబు

సిఎంకు కాంట్రాక్ట్ ఉద్యోగుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల గిరిజన ప్రాంత కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఫెడరేషన్ జిల్లా నాయకులు శెట్టి నాగరాజు తెలిపారు. ఫెడరేషన్ నాయకులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పై ప్రభుత్వ ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో 2012 సంవత్సరం తర్వాత కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకాలు ఎక్కువగా చేపట్టడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న 2014 జూన్ 2వ తేదీ క్రైటీరియా విధానంలో అయితే గిరిజన ప్రాంతంలో ఉన్న ఖాళీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు కొద్ది మందికి మాత్రమే రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందన్నారు. 80 శాతం మంది ఉద్యోగులు ఇంకా కాంట్రాక్ట్ వ్యవస్థలోనే ఉద్యోగాలు చేయవలసి ఉంటుందన్నారు. ఈ విధానంతో గిరిజన ప్రాంతంలోని వివిధ ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, కాంట్రాక్ట్ ఉద్యోగులలో నియామకమై ఐదు సంవత్సరాలు నిండిన గిరిజన ప్రాంత ఉద్యోగులను రెగ్యులర్ చేసే విధంగా స్థానిక గిరిజన ప్రాంతంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న అన్ని శాఖల్లోని ఉద్యోగులను రెగ్యులర్ చేసే విధంగా ముఖ్యమంత్రి, మినిస్టర్ కమిటీకి ప్రతిపాదనలు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో 2012 సంవత్సరంలో కాంట్రాక్టు ఉద్యోగాల్లో చేరిన వారి సర్వీసు ఇప్పటికి 12 ఏళ్లు పూర్తి కావస్తోందని, ఈ విషయంలో గిరిజన ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేయడం జరగాలని, అదే మాదిరిగా ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత నివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో 2014 సంవత్సరంలో అపాయింట్మెంట్ అయిన కాంట్రాక్టు ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేయడం జరిగిందని, అదే మాదిరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఐదు సంవత్సరాలు కాంట్రాక్ట్ సర్వీస్ నిండిన ప్రతి ఉద్యోగిని రెగ్యులర్ చేసే న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కమ్మిడి లక్ష్మణరావు ఎస్. బాలయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలపై ఉత్కంఠ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలపై రాజకీయ నేతలు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. మునిసిపల్ ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల కమిషన్ నుండి ఆదేశాలు రావడంతో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో చూడాలి. మున్సిపల్ చైర్మన్ రాజీనామా వ్యవహారంలో ఆ పార్టీలో కౌన్సిలర్లు మధ్య సఖ్యత లేదన్న విషయం రాజకీయ వర్గాలను విస్మయానికి గురి చేసింది. ముందుగా వైసిపిలో అంతర్గతంగా జరిగిన రాజకీయ ఒప్పందం ప్రకారం రెండేళ్ళ కాల పరిమితి మేరకే మాట ఇచ్చినప్పటికీ, చైర్మన్‌తో రాజీనామా చేయించిన విధానం సక్రమంగా లేదని, ఆ పార్టీలోనే ఓ వర్గంలో అసంతృప్తి నెలకొంది. రాజీనామా చేసిన మూడు నెలల తర్వాత, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఒక్కసారిగా మున్సిపల్ రాజకీయాలు వేడెక్కాయి. మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 14, తెలుగుదేశం 12, జనసేన ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒకరు, కౌన్సిలర్ లుగా ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జనసేన, టిడిపి సభ్యులు కలిస్తే 13 మంది సభ్యుల బలం ఉంటుంది. నర్సీపట్నం మున్సిపాలిటీలో చైర్పర్సన్ ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి ముందుగా ఆ పార్టీలో అంతర్గతంగా జరిగిన రాజకీయ ఒప్పందం ప్రకారంగా రెండు సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత రాజీనామా చేశారు. వీరి స్థానంలో 12 వార్డు కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి చైర్మన్‌గా, 8వ వార్డు కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ వైస్ చైర్మన్ గాను ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ గతంలోనే ప్రకటించారు. రెండు సంవత్సరములు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేసినప్పటికీ పూర్తి సంతృప్తి చెందలేదని ప్రజలకు సేవలు అందించే సమయంలో రాజీనామా చేయవలసి వస్తుందంటూ పలువురు వద్ద మాజీ చైర్పర్సన్ ఆదిలక్ష్మి బాధపడటం తెలిసిందే. కొంతమంది కౌన్సిలర్‌ల ఒత్తిడి మేరకే ఆమె రాజీనామా చేసినట్లు కూడా తెలుస్తోంది. ఆదిలక్ష్మి రాజీనామా చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొనకపోవడం ఇప్పుడు ఈ ఎన్నిక సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న లుకలుకలు బయట పడుతున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఏ మేరకు ఈ ప్రభావం చూపిస్తుందోనని పలువురు ఆశక్తిగా ఎదురు చూస్తున్నారు. టిడిపి, జనసేన కలిస్తే 13 మంది సభ్యుల బలం ఉన్నప్పటికీ, ఎస్సీ కౌన్సిలర్ లేక పోవడంతో చైర్పర్సన్‌కు పోటీ పెట్టకపోవచ్చునని వైసిపి వర్గాలు ధీమాతో ఉన్నాయి. కీలకమైన వైస్ చైర్మన్ పదవి విషయంలో కోనేటి రామకృష్ణ అభ్యర్థిత్వాన్ని వైసీపీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తుందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జనసేన కౌన్సిలర్ వైస్ చైర్మన్గా నామినేషన్ వేస్తే, టిడిపి కౌన్సిలర్లతో పాటు, వైసీపీలో కోనేటి రామకృష్ణని వ్యతిరేకించే ఒక వర్గం కౌన్సిలర్లు, మద్దతు తెలియజేస్తారా లేదా వేచి చూడాలి. మరోవైపు ఒకవేళ టీడీపీ వైస్ చైర్మన్ గా పోటీ చేస్తే భవిష్యత్తులో టిడిపిలో చేరాలనుకుంటున్న ఒకరిద్దరు వైసిపి కౌన్సిలర్లు ఉన్నారని, వారు లోపాయి కారిగా మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.

ఏటికొప్పాక మాజీ సుగర్స్ చైర్మన్ మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల:ఏటికొప్పాక మాజీ చక్కెర కర్మాగారం చైర్మన్, వైసిపి నాయకులు రాజాసాగి రామభద్రరాజు(చిరంజీవి) అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన పలు పర్యాయాలు ఏటికొప్పాక సుగర్స్ చైర్మన్ గా పనిచేశారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. మృతదేహానికి తంగేడు గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

గిరిజన యోధుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ:దేశ స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన గిరిజన స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, ఇంచార్జ్ అధ్యక్షుడు పివి సత్యనారాయణరావు కోరారు. గంటందొరకు నివాళులర్పించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు రెండేళ్ల సాయుధ పోరాటంలో ఎందరో గిరిజన యోధులు బ్రిటిష్ పాలకులతో పోరాడి ప్రాణ త్యాగం చేశారన్నారు. అల్లూరి అనుచరులను నిర్దిష్టంగా గుర్తించడంలో పాలకులు శ్రద్ధ చూపలేదని పూర్వపు విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 1922 నుంచి 24 వరకు జరిగిన సాయుధ పోరాటంలో బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసిన గిరిజన స్వాతంత్ర సమరయోధులను గుర్తించి వారి కుటుంబాలకు తగు జీవనోపాధి, శాశ్వత గృహ వసతి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పడాల డిమాండ్ చేశారు. కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో గాం గంటందొర, మల్లు దొర విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణం తగు చర్యలు తీసుకోవాలని సంఘం ఇంచార్జ్ అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ రావు కోరారు. వీరి విగ్రహాల ఏర్పాటుకు తమ సంఘం సిద్ధంగా ఉందని, అధికారిక అనుమతి కోసం ఆరు నెలలుగా అడుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి యువజన సంఘ రాష్ట్ర కార్యదర్శి శ్యామల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆవలో మట్టి తవ్వకాలను అరికట్టాలి

ప్రజాశక్తి -పాయకరావుపేట:మండలంలోని గుంటపల్లి ఆవలోని అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలను అరికట్టి, మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాయకరావుపేట ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆవ చెరువులో మట్టి తరలింపునకు ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలన్నారు. గత వారం రోజులుగా జెసిబి లతో తవ్వి పెద్ద పెద్ద టిప్పర్లలో పగలు రాత్రులు అనకుండా మట్టి తరలిస్తున్నారన్నారు. వేరు వేరు ప్రాంతాలలో ప్రైవేట్ రియల్ ఎస్టేట్ ప్లాట్‌లకు మట్టి వేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములో ఈ విధంగా ప్రైవేటు వ్యక్తులు అనుమతులు పొందిన దానికి విరుద్ధంగా యదేచ్చగా మట్టిని తరలిస్తున్నారన్నారు. పాయకరావుపేట పేటకు చెందిన అధికార పార్టీ నాయకుల అండదండలతో మట్టి మాఫియాకు పాల్పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోకపోతే న్యాయ స్థానాలను ఆశ్ర ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బత్తిన నాగేశ్వరరావు, మామిడి నానాజీ తదితరులు పాల్గొన్నారు

జలజీవన్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనులు వేగ వంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొల్ల బాబురావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పలువురు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల నుంచి జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయని రాత్రి సమయంలో కనీసం నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పలువురు గుత్తేదారులు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, డీఈ ఆనంద్, ఏఈ కరుణ, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-రోలుగుంటమండలంలో ప్రజలతోనూ, రాజకీయ నాయకులతో తక్కువ సమయంలోనే అవినాభావ సంబంధం ఏర్పడిందని, రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించి అనకాపల్లి జిల్లాలోనే మొదటి స్థానం తీసుకు వచ్చారని తహాశీల్దార్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. తహాశీల్దార్, డిటి త్రివేణి, రీ సర్వే డిటి రాజేంద్ర, ముగ్గురు వీఆర్వోలు, ఒక అటెండర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మండల కార్యాలయంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో బదిలీ అయిన ఉద్యోగులను సన్మానించారు.

తొమ్మిది మంది 'గీతం' దంత వైద్య విద్యార్థులకు

రిలయన్స్ ప్రతిభా పురస్కారాలు

ఒక్కొక్కరికీ రూ.2లక్షల నగదు పురస్కారం

రిలయన్స్ పురస్కారాలకు ఎంపికైన గీతం దంత వైద్యవిద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ :జాతీయస్థాయిలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసించే విద్యార్థులలో ప్రతిభ గల వారిని ప్రముఖ కార్పొరేట్ సంస్థ రిలయన్స్ ఏటా అందిస్తున్న ప్రతిభా పురస్కారాలకు ఈ ఏడాది గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రికి చెందిన తొమ్మిది మంది దంత వైద్య విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సీతారామరాజు తెలిపారు. ఈ ప్రతిభ అవార్డుల ఎంపిక కోసం రిలయన్స్ సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో ఐదు వేల మంది విద్యార్థులు పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుంచి గీతం దంత విద్యార్థులు తొమ్మిది మంది ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం కింద. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రిలయన్స్ సంస్థ రూ.2 లక్షల నగదు బహుమతి అందజేస్తుందన్నారు. గీతం దంత వైద్య కళాశాలలో బిడిఎస్ విద్యార్థులు ఎ.శశికళ, ఎమ్.గుణ పద్మప్రియ, జి.మేఘన, కె.కీర్తన, ఎమ్.శ్రీలయ, నూరియా ఫిజా షేక్, పి.శ్రీజ, ఆర్.రామ వరలక్ష్మీ, కె.శ్రీవర్షిణి రిలయన్స్ ప్రతిభా పురస్కారాలకు ఎంపిక కావడంపై గీతం అధ్యక్షుడు ఎమ్.భరత్, కార్యదర్శి ఎమ్.భరద్వాజ వారిని అభినందించారు.

గ్రంథాలయంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ దాడి శ్రీను ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆరిపాక శ్రీనివాసరావు పర్యవేక్షణలో 46 మంది చిన్నపిల్లలు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎదుగుతున్న పిల్లలు తీసుకోవాల్సిన ఆరోగ్యసూచనలు చేశారు. కార్యక్రమంలో దాడి రమణ, చిట్టిబాబు గ్రంథాలయాధికారి బి సూర్యకళ, లైబ్రరీ అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ పెతకంశెట్టి భూలోకరావు సెక్రటరీ ఆడారి రామకష్ణ,, రిసోర్స్ పర్సన్స్ కూచిపూడి డాన్స్ టీచర్ శర్వాణిదేవి, డిగ్రీ స్టూడెంట్ సబీన యాస్మిన్ , మౌనిక టీచర్, కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు..

టిడిపి మేనిఫెస్టో ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి మేనిఫెస్టో పొందుపర్చిన సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ఎం శ్రీభరత్ పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబుతో కలిసి టిడిపి మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, ప్రజలకు భద్రత, భరోసా కల్పించే చంద్రన్న పాలన రానుందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో టిడిపి అధికారం చేపట్టనుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ముందుగా పేదల ఆకలిని తీర్చే అన్నా క్యాంటీన్లను పున:ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ పరిశీలకులు కోట్ని బాలాజీ, పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మొల్లి లక్ష్మణరావు, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కశిరెడ్డి దామోదరరావు పాల్గొన్నారు.

గిరిజనులకు అందని సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి మారేడుమిల్లి : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు గిరిజనులకు అందడం లేదని, ఆదివాసీల పేరుతో కొంత మంది గిరిజనేతరులు దక్కించుకుంటున్నారని డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. వై.రామవరం మండలం పాత కోట పంచాయితీ పరిధిలోని మారు మూల గ్రామాల గిరిజనులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది ఎకరాల భూమి ఉన్న గిరిజనులకు రేషన్ కార్డులు, పింఛన్లు తొలగించారని, కాని వారికి భూమి ఉన్నా దాని నుండి ఆదాయం వచ్చే మార్గం లేదని పేర్కొన్నారు. వీటిపై ప్రశ్నించే నాయకులు లేరని, నాయకులుగా మనమే తయారు కావాలని పిలుపునిచ్చారు. గిరిజనేతరులు గిరిజన అమ్మాయిలను పెళ్లి చేసుకొని అక్రమ మార్గంలో రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని తెలిపారు. గిరిజన యువత విద్యావంతులై ప్రభుత్వ అధికారులుగా రావాలన్నారు. గంజాయి స్మగ్లింగ్, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు.

బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం 52 జిఒ తీసుకొచ్చిందని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ బినామీ పేరుతో పాత కోట నుంచి ఆకుమామిడి కోట సీసీ రోడ్డు నిర్మాణంలో కోట్లాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కొంత మంది గిరిజనుల మధ్య గొడవలు, భూ తగాదాలు పెడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు శరంకోట అబ్బాయి రెడ్డి, మట్ల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సాదల బాబురావు, పెద్దిరెడ్డి, కొండ్ల అబ్బాయి రెడ్డి, కామేశ్వర రెడ్డి, సాగర్ కుమార్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, లింగా రెడ్డి, మూడు పంచాయితీల పెద్దలు, యువత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత

తేజ ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ సృష్టికర్త

హరినారాయణకు 'గీతం' డాక్టరేట్

సినీ నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్ ... 10న గీతం స్నాతకోత్సవంలో అందజేత

ప్రజాశక్తి- మధురవాడ : ఈ నెల 10న నిర్వహించనున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవంలో తేజ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కోటా హరినారాయణకు గీతం వర్సిటీ గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్) ప్రదానం చేయనుందని విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. అలాగే ప్రముఖ తెలుగు సినీనటి వాణిశ్రీకి డిలిట్ గౌరవ డాక్టరేట్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. గీతం స్నాతకోత్సవానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ముఖ్యఅతిధిగా రానున్నారని తెలిపారు. గీతం వర్సిటీ విశాఖ ప్రాంగణం నుంచి ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, లా, నర్సింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, సామాజిక శాస్త్రాలను 2022-23 విద్యాసంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు స్నాతకోత్తర పట్టాలను, ప్రతిభ గల విద్యార్థులకు బంగారు పతకాలను అందజేస్తామన్నారు.



అవార్డు గ్రహీతల గురించి క్లుప్తంగా...

డాక్టర్ కోటా హరినారాయణ: ఒడిశాకు చెందిన డాక్టర్ కోటా హరినారాయణ వైమానిక రంగంలో నిపుణులుగా పేరుపొందారు. భారత రక్షణ పరిశోధన సంస్థ(డిఆర్‌డిఒ) లో వివిధ స్థాయిలలో పనిచేసిన హరినారాయణ తేజా ఎయిర్‌క్రాఫ్ట్ రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించారు. డిఆర్‌డిఒ నుంచి టెక్నాలజీ లీడర్ షిప్ అవార్డుతో పాటు నేషనల్ ఎయిరో నాటిక్స్ అవార్డు, ఆర్యభట్ట అవార్డు, డాక్టర్ వై.నాయుడమ్మ వంటి అవార్డులతో పాటు భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అందుకున్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్‌గా పనిచేయడంతో పాటు ఐఐటిల పాలక మండలిలో సేవలు అందించారు.

వాణిశ్రీ: తెలుగు చలన చిత్ర రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా కథానాయిక పాత్రలతో పాటు తన నవరస నటనతో తెలుగు వారి ఆదరాభిమానాలు చూరగొన్న సీనియర్ నటి వాణిశ్రీ తమిళ, కన్నడ చిత్రాలతో ప్రజలకు చేరువయ్యారు. నంది అవార్డుతో పాటు తమిళనాడు ప్రభుత్వ అవార్డులను, ఫిలింఫేర్ అవార్డులను, పలు గౌరవ పురస్కారాలను స్వీకరించారు.

వారాహి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యునిగా సందీప్

ప్రజాశక్తి -ఆనందపురం: ఈనెల 14న అన్నవరం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉభయ గోదావరి జిల్లాల్లో తలపెట్టిన వారాహి యాత్రకు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యునిగా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సందీప్ పంచకర్లను నియమించారు.వారాహి యాత్ర సెంట్రల్ ఆర్గనైజింగ్ టీంలో కమిటీ సభ్యునిగా బాధ్యతలు అప్పగించడంపై సందీప్ ఆనందం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతకు న్యాయం చేస్తానన్నారు. జనసేనాని పవన్‌కల్యాణ్, పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.

దళితులపై దమనకాండకు నిరసన

అనుమాయమ్మను హంతకులను అరెస్ట్ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రకాశం జిల్లాలో దళిత మహిళా అనుమాయమ్మను హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని టిడిపి దళిత నాయకులు డిమాండ్ చేసారు. దళితులపై దమనకాండకు నిరసనగా విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవిందు ఆధ్వర్యంలో పెదగదిలి కూడలి, అంబేడ్కర్ విగ్రహం వద్ద 9, 10, 11, 12, 13 వార్డుల టిడిపి దళిత నేతలు, ఇతర పార్టీ శ్రేణులునిరసన చేపట్టాయి. కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలపగపూడి రామక్రిష్ణబాబు ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత మహిళ అనుమాయమ్మ హంతకులను అరెస్టు చేయాలని నినాదాలు చేసారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామక్రిష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై ఇష్టారాజ్యంగా దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దళిత వ్యతిరేక చర్యలు చేపడుతున్న వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడుగు కుమార్, దళిత నాయకులు గాడి సత్యం, బాదరు బాలరాజు, తురకపూడి బాలస్వామి, టిడిపి నాయకలు పాల్గొన్నారు.

సిఎండిసి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- సీతమ్మధార : క్రిస్టియన్ మైనారిటీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సిఎండిసి) క్రైస్తవులకు చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ కొనియాడారు. బుధవారం సీతమ్మధారలోని కావలెంట్ క్రైస్ట్‌చర్చిలో సిఎండిసి వర్కింగ్ ప్రెసిడెంట్ గుణ శామ్యూల్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎంపిక చేసిన క్రిస్టియన్లను సిఎండిసి ఆధ్వర్యంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ సిఎండిసి సేవా కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కుట్టుమిషన్లు పంపిణీ, వైద్యశిబిరాలను నిర్వహణ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సిఎం జగన్ కూడా క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలను ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గౌరవ వేతనం పొందుతున్న పాస్టర్లు తరపున సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సిఎండిసి వ్యవస్థాపకుడు బిషప్ పండు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సంస్థ చేస్తున్న కార్యక్రమాలనువివరించి, వాటికి సహకరిస్తున్న కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సభ్యులందరికీ గుర్తింపు కార్డులు, బీమా ధ్రువీకరణ పత్రాలు, బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఎ పాల్, అధ్యక్షులు డేవిడ్ పాల్, జనరల్ సెక్రటరీ జీవనమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల చైర్మెన్ జయకుమార్, ఆయా జిల్లాల చైర్మన్లు స్టీఫెన్, నవీన్ కుమార్,ఉదయ్ కుమార్, రవితేజ, ఎం పాల్, షడ్రక్ పాల్గొన్నారు

పద్మనాభుని ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి- పద్మనాభం : పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న మండలకేంద్రమైన పద్మనాభం గ్రామంలో అనంత పద్మనాభ స్వామి కొండపై ఉన్న ఆలయ పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు బుధవారం సంబంధిత దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు కొలతలు వేసి, అంచనా ప్రతిపాదనలు రూపకల్పనకు సిద్ధమౌతున్నారు.

ఆరేళ్ల క్రితం పద్మనాభంలోని కొండపైనున్న పద్మనాభుని ఆలయంపై పిడుగుపడడంతో పాక్షికంగా దెబ్బతింది.ఆలయ వంశపారపర్య ధర్మకర్త, విజయనగరం రాజు పూసపాటి అశోక్ గజపతిరాజు దీనిపై స్పందిస్తూ, పాడైన పద్మనాభుని ఆలయాన్ని పునర్నిర్మించాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈమేరకు దేవాదాయశాఖ కమిషనర్‌కు రూ.60 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరు కావడంతో పనులకు ఉపక్రమిస్తున్నారు. చేపట్టాల్సిన పనులపై సర్వే చేసి, అంచనాలు రూపొందించి టెండర్లను ఆహ్వానించడంద్వారా పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎవివి శివప్రసాద్, అసిస్టెంట్ స్తపతి మీనాక్షి దేవాలయ కొలతలు వేయగా, ఆలయ పురోహితులు, తదితరులు సహకరించారు.